# మనిషికో చరిత్ర

చిటపట చినుకులు పడుతూ వుంటే సూతుడి సరసన చేరటం కోసం శౌనకాది మునులు చెట్టు నీడ కోసం పరుగెత్తుకుంటూ వెళ్ళి, జడలు విప్పి జుట్టు ఆరబెట్టుకుంటూ అక్కడ ఆసీనులయారు. ఆ సీను చూసి అక్కడి జంతుజాలమంతా ఏమీ బెట్టుచేయకుండా కూర్చుని కథా ప్రారంభం కోసం ఎదురుచూస్తున్నారు.

చెట్టు మీది మత్తకోకిల మత్తుగా "వాన వస్తున్నదే" అంది, తన మెడ మీద పడ్డ వాన చినుకులను విసురుగా విదిలిస్తూ.

సూతుడు చిన్నగా నవ్వి "అమెరికాలో సంభాషణ మొదలు పెట్టేటప్పుడు చాలమంది వాతావరణ విశేషాలతో మొదలు పెడతారు తెలుసా?" అన్నాడు చెట్టు క్రింద చినుకులు పడని చోటులో ముడుచుకు కూర్చుని.

పక్కనే కూర్చున్న ఎర్ర కోతి కిచకిచా నవ్వి "గురువుగారు నాలుగో కథ మొదలు పెడుతున్నారోచ్!" అన్నది.

శౌనకుడు విసుక్కున్నాడు. "నాలుగో కథేమో కానీ, నవ్వు నాలగందాల చేటు. ప్రతిదానికీ అలా నవ్వకు" అన్నాడు.

సూతుడు ఒకసారి తలపంకించి కళ్ళు మూసుకున్నాడు. ఒక్క క్షణం ఆగి కళ్ళు తెరిచాడు. "అదిగో అలా ఆ అమెరికా దేశం చూడండి. అక్కడి ప్రతి మనిషికీ ఒక చరిత్ర. వీసాల చరిత్ర"

"మీసాలా? అక్కడెవరికీ మీసాలు లేవే..." అంటున్న చిన్నముని మాటలకు అడ్డం వస్తూ అన్నాడు శౌనకుడు. "మీసాలు కాదు చిన్నమునీ! వీసాలు. అంటే విదేశాల

లో ప్రవేశానికి అనుమతించే పత్రాలు. కంగారు పడకుండా కథ విను. ఆ వీసాల చరిత్ర అదే అర్ధమవుతుంది"

ఎర్రకోతి తన తెల్లటి పళ్ళు వికిలించి గుర్రుగా నవ్వింది. సూతుడు శౌనకాది మునులకు కథ చెప్పటం ప్రారంభించాడు.

యూనివర్సిటీకి దగ్గరగా ఉన్నది గేట్‌వే ఎపార్టుమెంట్ కాంప్లెక్స్. పెళ్ళయిన స్టూడెంట్సుకి యూనివర్సిటీ అక్కడ చౌకగా అపార్టుమెంట్లు అద్దెకి ఇస్తుంది.

శివరామ్ అంతకు రెండురోజుల ముందే బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్‌లో పి.హెచ్.డి. పూర్తిచేసి, తన ఆనందాన్ని మిత్రులతో పంచుకుందామని తన ఎపార్టుమెంటులో చిన్న పార్టీ ఇస్తున్నాడు. లలిత వంటంతా పూర్తిచేసుకుని ఎపార్టుమెంట్ నీటుగా సర్ది అతిధులను ఆహ్వానించటానికి సిద్ధంగావుంది. లలిత కూడాఆ యూనివర్సిటీలోనే కంప్యూటర్ సైన్స్‌లోడిగ్రీ చేస్తున్నది. అంతేకాకుండా తనకి ప్రావీణ్యం వున్న కూచిపూడి నృత్యాన్ని కొంతమంది పిల్లలకు నేర్పుతున్నది కూడాను. దానివల్ల ఆమెకు సాధనతో పాటు శివరామ్‌కి వచ్చే ఆదాయానికి తోడుగా కొన్ని బిల్లులు కట్టటానికి ఆమె ఆదాయం సరిపోతున్నది.

డోర్‌బెల్లు మోగగానే శివరామ్ తలుపు తీశాడు.

"హాయ్ షివ్‌రామ్" అంటూ పలకరించింది శాంతి.

ఆమె వెనుకనే ప్రతాప్.

"రండి. లోపలికి రండి" హిందీలో ఆహ్వానించాడు శివరామ్.

"ఆర్ వుయ్ ఎర్లీ? షివ్‌రామ్" అన్నది శాంతి.

"లేదు! యు ఆర్ ఆన్ టైమ్ శాంతీ. నన్ను షివ్‌రామ్ అని పిలవ్వద్దని నీకు కనీసం వందసార్లు చెప్పాను. నా పేరు షివ్‌రామ్ కాదు. శివరామ్!"

శాంతి గలగలా నవ్వి "నీక్కూడా నేను చాలసార్లు చెప్పాను. నువ్వు షివ్‌రామ్, నేను షాంతి అని. దటీజ్ కరెక్ట్!" అన్నది.

ప్రతాప్ నవ్వాడు, ఇదెప్పుడూ ఉండే భాగోతమేలే అన్నట్టు. లలిత కూడా నవ్వుతూ వాళ్ళని ఆహ్వానించింది.

శాంతి శర్మ, ప్రతాప్ శర్మ ఇండియాలో ఉత్తర ప్రదేశ్‌కి చెందినవాళ్ళు. వాళ్ళు తమ పేర్లు షాంతి షెర్మ, ప్రతాప్ షెర్మ అని చెప్పుకుంటారు. ప్రతాప్‌కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎం.ఎస్. చేసి ఉద్యోగ ప్రయత్నంలో వున్నాడు.

దాదాపు ఒకేసారి వచ్చారు రాంబాబూ, హరీ. రాంబాబు జియాలజీలో పి.హెచ్.డి. చేసి ఒక సంవత్సరం క్రితమే ఉద్యోగంలో చేరాడు. హరి కంప్యూటర్ సైన్స్

లో పి.హెచ్.డి. చేస్తున్నాడు.

అందరికీ చిప్స్, పికాంటే సాస్, కోకోకోలా ఇచ్చింది లలిత. ప్రతాప్, హరి మాత్రం ఫ్రిడ్జ్‌లోని కూర్స్ బీర్ తీసుకున్నారు.

"ఇంకా ఎవరన్నా రావాలా?" అడిగాడు హరి.

"ప్రసాద్ వస్తానన్నాడు కానీ, ఇంకా రాలేదు ఏమయిందో... " అన్నాడు శివ రామ్.

ప్రతాప్ తన చేతిలోని బీర్‌కాన్ పైకెత్తి "గుడ్‌లక్ టు శివరామ్ ఫర్ కంప్లీటింగ్ హిజ్ పి.హెచ్.డి. సక్సెస్‌ఫుల్లీ!" అన్నాడు.

అందరూ గ్లాసులు పైకెత్తి "ఛీర్స్! గుడ్‌లక్ శివరామ్" అన్నారు.

"అంతేకాదు. ఇంకో గుడ్ న్యూస్‌కూడా వుంది. శివకివాళే సింప్సన్ కన్సల్టింగ్ కంపెనీలో ఉద్యోగంకూడా వచ్చింది. వాళ్ళే ముందు హెచ్‌వన్ వీసాకి, తర్వాత గ్రీన్ కార్డుకి స్పాన్సర్ చేస్తామన్నారు" అంది లలిత.

శాంతి లేచి గట్టిగా చప్పట్లు కొట్టి "మరి అంత మంచి కబురు ఇంతదాకా ఎందుకు చెప్పలేదు. కంగ్రాట్యులేషన్స్" అన్నది.

అందరూ శివరామ్‌ని అభినందించారు.

లలిత హరిని అడిగింది "ఇండియాలో మీ శ్రీమతి ఎలా వున్నారు? ఎప్పుడు వస్తారు అమెరికాకి?" అని.

చెట్టుమీద కూర్చుని కథ వింటున్న నల్ల కాకి "హరి మరి అమెరికాలో వుంటే, వాళ్ళావిడ ఇండియాలో ఎందుకు వుంది?" అని అడిగింది కా బాషలో.

తన నల్లటి శరీరంమీద చెట్టు మీదనించి పడ్డ తెల్లటి మరకల్ని దులుపుకుంటూ, పైకి చూసి అన్నది బవిరి గేదె "ఇది నీపనేనా అమ్మా!" అని.

అంటూనే కొంచెం పక్కకి జరిగి "నాకు తెలుసు నీకామాత్రం కూడా బుర్రలేద ని! అసలు నేనే ఆ ప్రశ్నకి జవాబు చెప్పగలను కానీ... " అని శౌనకుడి వేపు చూసి, "మీరయితే కథలు బాగా చెప్పగలరు. అసలే నాది బర్రె గొంతు. మీరే చెప్పండి" అన్నది

శౌనకుడు బొంగురుపోయిన తన గొంతునొకసారి సవరించుకుని అన్నాడు

"హరి వాళ్ళ నాన్న ఇక్ష్వాకుల కాలం నాడెప్పుడో అమెరికా రావటానికి గ్రీన్‌కార్డుకి అప్లయ్ చేసి, ఇంటర్నెట్ కాలంలో అది వచ్చాక భార్యతోనూ హరితోనూ నాలుగేళ్ళ క్రితమే అమెరికాకి వచ్చాడు. అందరూ కలిసి అంతకుముందు సంవత్సరం ఇండియావెళ్ళి అక్కడ హరికి ఘనంగా పెళ్ళిచేశారు. హరి మద్రాసు అమెరికన్ కాన్స లేట్ ఆఫీసులో సరోజకి వీసాకి అప్లయ్ చేసి వచ్చాడు కానీ, దేశదేశాలకి ఇచ్చే కోటా

ప్రకారం ఇప్పటికి రెండేళ్ళు గడిచినా ఆమెకి ఇంకా వీసా రాలేదు. ఇంకొక రెండేళ్ళు అయితే కానీ, సరోజకి అమెరికా వచ్చే అవకాశం లేదు. అప్పటి దాకా టెలిఫోను బిల్లులు కట్టటం, ఉత్తరాలు రాసుకోవటం లేకపోతే అటు ఇండియాలోనో, ఇటు యూరప్‌లోనో కలవటం. అంతే!"

అది విని చెట్టు మీది మత్తకోకిల, మావిచిగురు తింటూ తీయటి గొంతులో విరహం చూపిస్తూ ఒక భావగీతం పాడింది. సూతుడు కమండలం లోని నీళ్ళు గడగడా రెండు గుటకలు వేసి శౌనకాది మునులకు కథ చెప్పటం కొనసాగించాడు.

వాళ్ళ వీసా కథ విని "దటీజ్ రెడీక్యులస్" అన్నది శాంతి.

"అవును మనం చేయగలిగిందేమీ లేదు. ఇమ్మిగ్రేషన్ రూల్సు అలా వున్నాయి మరి" అన్నాడు హరి.

"మీ ఆవిడ ఇక్కడికి రాకపోయినా, కనీసం నీకొక గ్రీన్‌కార్డు వుంది హరీ. నాకది కూడా లేదు" అన్నాడు రాంబాబు. రాంబాబుకి అతని కంపెనీ వాళ్ళు హెచ్ వన్ వీసా తెప్పించారు. కంపెనీ ద్వారానే త్వరలో ఇమ్మిగ్రేషన్‌కికూడా అప్లయ్ చేయబోతున్నాడు. అప్లయ్ చేశాక గ్రీన్ కార్డు రావటానికి ఇంకో మూడేళ్ళ పైన పడుతుంది.

లలిత అన్నది "గ్రీన్‌కార్డు రాకుండాఎక్కడికి పోతుందండీ! అందులోనూ మీ కంపెనీ పెద్ద ఇంటర్నేషనల్ కంపెనీ. వాళ్ళకిలాటి లావాదేవీలన్నీ బాగాతెలుసు. కాకపోతే ప్రాసెసింగ్‌కి టైమ్ పడుతుంది. ప్రొసీజర్లన్నీ ఫాలో అవాలికదా మరి. అది సరే కానీ, ముందు భోజనాలకి లేవండి"

అందరూ ప్లేట్లల్లో డిన్నర్ తెచ్చుకుని కూర్చున్నాక, శాంతి అన్నది రాంబాబుతో "మరి రాంబాబూ! నీ పెళ్ళెప్పుడు?" అని.

"ఏమో! మా అమ్మా నాన్నా ఇండియా వచ్చి పెళ్ళిచేసుకోమంటున్నారు. మీరన్నట్టుగా అన్ని లావాదేవీలు తెలిసిన మా కంపెనీ నాకు హెచ్‌వన్ వీసా తెప్పించింది కానీ పప్పులో కాలేసి మల్టిపుల్‌ఎంట్రీ వీసామాత్రం తెప్పించలేదు. కనుక నేను ఇండియా వెడితే పెళ్ళి చేసుకోవచ్చును కానీ, తిరిగి అమెరికాకి రావటానికి వీల్లేదు!"

శివరామ్ అన్నాడు "దానికో పద్ధతి వుంది కదా. అమెరికన్ హెచ్‌వన్ వీసా మీద, అటు కెనడాకి కానీ, ఇటు మెక్సికోకి కానీ సులభంగా వెళ్ళవచ్చు.అక్కడి నించీ తిరిగి వచ్చేటప్పుడు, అమెరికన్ ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంటువారి చేత మల్టిపుల్ ఎంట్రీకి ముద్ర వేయించుకుంటే సరిపోతుంది. అప్పుడు మీకు ఇండియా వెళ్ళి పెళ్ళి చేసుకు రావటానికి వీలవుతుంది"

అదోలా నవ్వాడు రాంబాబు. "అలా అనుకునే నేను శానాంటోనియో మీదు

గా మెక్సికోలోని లోరేడోకి వెళ్ళాను. తిరిగి వస్తున్నప్పుడు వాళ్ళు మళ్ళీ సింగిల్ ఎంట్రీ స్టాంపే వేశారు. మల్టిపుల్ ఎంట్రీ వీసా ఇవ్వలేదు"

"అయితే ఏం చేస్తావ్?" అని అడిగాడు శివరామ్.

"ఏం చేస్తాను. కొన్నాళ్ళాగి కెనడా వెళ్ళి, అక్కడ మళ్ళీ ప్రయత్నం చేద్దామనుకుంటున్నాను. కానీ ఈ లోగా మా అమ్మా నాన్న తొందరపడుతున్నారు"

"అంతేకానీ, మీకు తొందర లేదంటారు" అన్నది లలిత నవ్వుతూ.

రాంబాబు కూడా నవ్వాడు.

హరి అన్నాడు. "పెళ్ళి చేసుకునేటట్టయితే, గ్రీన్‌కార్డు రాకముందే చేసుకుని మీఆవిడ్ని ఇక్కడికి తెచ్చేసుకో. లేకపోతే – నీవేనా నను తలచినది.. అని నాలాగా విరహ గీతాలు పాడుకోవాల్సి వస్తుంది"

"రాంబాబూ! కనీసం నీకు ఉద్యోగంవుంది. గ్రీన్‌కార్డు వచ్చే అవకాశంవుంది. నాకయితే డిగ్రీ అయిపోయింది కానీ, ఇంకా ఉద్యోగం లేదు. ఎక్కడ ఇంటర్వ్యూకి వెళ్ళినా, గ్రీన్ కార్డు లేనిదే ఇవ్వం అంటున్నారు. త్వరలో ఉద్యోగం రాకపోతే నేనూ శాంతీ ఇండియాకి తిరిగి వెళ్ళిపోవాల్సి వస్తుంది" ప్రతాప్ అన్నాడు కొంచెం దిగులుగా.

"రాకెక్కడికి పోతుందిలే! గట్టిగా ప్రయత్నం చెయ్యి" అన్నాడు హరి.

"ప్రసాద్ ఇంకా రాలేదే?" అన్నాడు శివరామ్.

ఈలోగా ఫోన్ మోగింది.

లలిత ఫోన్ తీసుకుని "హలో ప్రసాద్! ఇప్పుడే మీ గురించి అనుకుంటున్నాం. మీకు నూరేళ్ళ ఆయుష్యు" అన్నది.

"నా కెందుకండీ నూరేళ్ళ ఆయుష్యు. దాంట్లో కొంత మా అమ్మకిస్తే బాగుండేది. ఇందాకే ఇండియా నించి మా అక్కయ్య ఫోన్ చేసింది. మా అమ్మకి హార్టెటాకు వచ్చిందిట. నన్ను చూడాలని కలవరిస్తూనే కన్నుమూసిందిట. కనీసం ఆఖరి చూపుకి కూడా దగ్గరలేను నేను! అంతేకాదు కనీసం ఇండియా వెళ్ళి, మిగతా కార్యక్రమం పూర్తి చేయటానికి నాకు వీసా కూడా లేదు.... ఏం చేయాలో అర్ధం కావటం లేదు...." ప్రసాద్ మాట ఆగిపోయింది. ఫోనులో అవతలి పక్కనించీ అతని ఎక్కిళ్ళు వినిపిస్తున్నాయి.

లలితకి ఏమనాలో తెలీక, ఫోన్ శివరామ్‌కిచ్చి విషయం చెప్పింది.

"ప్రసాద్! నువ్వు బాధపడకు. నేనిప్పుడే వస్తున్నాను" అన్నాడు శివరామ్, అతనికి ధైర్యం చెబుతూ..

హరి, రాంబాబు, ప్రతాప్ అతనితో పాటే లేచి "పదండి! వెడదాం" అన్నారు.

సూతుడు అంతటితో ఆ కథ చెప్పటం పూర్తయిందని సూచిస్తూ లేచి నుంచు

న్నాడు.

పక్కనే వున్న గున్న ఏనుగు "కథ బాగానే వుంది కానీ చివరలో నా అంత బరువుగా వుంది బాబూ" అన్నది భారంగా లేచి నుంచుంటూ.

"అదేమరి. అమెరికా వెళ్ళి అందరూ ఏదో సుఖపడుతున్నారనుకుంటారంతా! ఈ వీసాల కథలు కొన్ని వింటుంటే మాత్రం, ఎందుకొచ్చిన కష్టాలురా నాయనా అనిపిస్తుంది" అన్నాడు శౌనకుడు, ఎర్రటి అంగవస్త్రాన్ని దులిపి భుజాన వేసుకుంటూ.

"చీకటి పడుతున్నది. మనందరం స్నానాలు చేస్తే మంచిది" అంటూ తనూ లేచాడు శౌనకుడు.

సూర్యుడు అప్పుడే ఎర్రగా అస్తమిస్తున్నాడు. ❀